# నమస్తే తెలంగాణ

## ఆదిలాబాద్ - నిర్మల్

10 నిజామాబాద్ శుక్రవారం 11 అక్టోబర్ 2024 ADILABAD NIRMAL


## కూతురు జీవితం ఏమవుతుందనే బెంగతో..

### అల్లుడు మృతి చెందిన రెండు రోజులకే అత్త మృతి



వచ్చలాబాయి(ఫైల్)



కర్నేవార్ గణేశ్(ఫైల్)

భీంపూర్, అక్టోబర్ 10 : మండలంలోని కరంజి(టి) గ్రామానికి చెందిన కర్నేవార్ గణేశ్(52) ఈ నెల 4వ తేదీన తలమడుగు మండలంలోని కోడట్ వద్ద శునకాలు అడ్డురావడంతో బైక్ అదుపు తప్పి కిందపడిపోయాడు. తీవ్రగాయాలు కావడంతో హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ ఈనెల 8న మంగళవారం మృతి చెందాడు. గణేశ్‌కు భార్య కవిత(అంగన్‌వాడీ టీచర్), కూతురు నవ్యశ్రీ వివాహం కాగా.. కుమారుడు నవీన్ డిగ్రీ పూర్తయింది. గణేశ్ అత్తమ్మ రాజులవార్ వచ్చలాబాయి(75) కూతురు వద్దనే 20 ఏండ్లుగా ఉంటున్నది. అల్లుడు మృతి చెందడంతో కూతురు జీవితం ఎలా ఉంటుందోననే బెంగతో ఆకస్మికంగా మృతి చెందింది. రెండు రోజుల తేడాతో మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

## విద్యారంగ అభివృద్ధిని పట్టించుకోని ఎమ్మెల్యే



బెల్లంపల్లి, అక్టోబర్ 10 : బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ నియోజకవర్గంలో విద్యారంగ అభివృద్ధిపై ఏమాత్రం దృష్టి పెట్టిడం లేదు. రాష్ట్ర వ్యాప్తంగా యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ హాస్టల్ భవనాలు మంజూరు చేశారు. కానీ బెల్లంపల్లి నియోజకవర్గానికి మాత్రం మొండి చేయి చూపించారు. ఇప్పటికే ఇంజినీరింగ్ కళాశాల మంజూరులో కూడా నియోజకవర్గానికి తీరని అన్యాయం జరిగింది. కళాశాలలు, ఇతర విద్యారంగ అభివృద్ధికి ఎమ్మెల్యే తగిన ప్రాధాన్యత ఇవ్వకపోవడం దారుణం. రేవంత్ రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి విద్యారంగంపట్ల ఉదాసీనత వైఖరి అవలంబిస్తున్నారు. పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను ఇంతవరకు విడుదల చేయలేదు. ఇక్కడ కాంగ్రెస్ ఎమ్మెల్యే ఉన్నా విద్యారంగానికి ఎలాంటి ఉపయోగం లేకుండాపోయింది. ఇప్పటికైనా ఇంటిగ్రేటెడ్ హాస్టల్ జాబితాలో బెల్లంపల్లి నియోజకవర్గాన్ని కూడా చేర్చాలి.

- దీపక్‌కుమార్, బెల్లంపల్లి



సమీక్షలో మాట్లాడుతున్న ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా

## అధికారులతో కలెక్టర్ సమీక్ష


ఎదులాపురం, అక్టోబర్ 10 : ఫ్యామిలీ డిజిటల్ కార్డు, ఎల్ఆర్ఎస్, ధరణీలపై గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో సబ్ కలెక్టర్ యువరాజ్ మర్మట్‌తో కలిసి కలెక్టర్ రాజర్షి షా సమీక్ష నిర్వహించారు. ఆర్డీవోలు, తహసీల్దార్లు, పంచాయతీ, ఇరిగేషన్, ఎంపీడీవోలు, ఎంపీవోలు, ఏఈలకు పలు సూచనలు చేశారు. పైలెట్ ప్రాజెక్టుగా తీసుకున్న గ్రామాల్లో సర్వే పూర్తయిందని తెలిపారు. ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను సత్వరమే పరిష్కరించేందుకు ఇంటింటికీ వెళ్లి పరిశీలించడం జరుగుతున్నదని తెలిపారు. ధరణీ దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఆర్డీవో వినోద్ కుమార్, డీపీవో శ్రీలత పాల్గొన్నారు.

### పొరపాట్లకు తావివ్వకుండా చూడాలి

ఫ్యామిలీ డిజిటల్ కార్డు డేటా ఎంట్రీ విషయంలో ఎటువంటి పొరపాట్లకు తావివ్వకుండా సక్రమంగా సమాచారాన్ని ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని కలెక్టర్ రాజర్షి షా అధికారులకు సూచించారు. గురువారం మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన డిజిటల్ ఫ్యామిలీ కార్డు డేటా ఎంట్రీని పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. కుటుంబం ఫొటో ఆన్‌లైన్‌లో తప్పనిసరిగా అప్‌లోడ్ చేయాలని, రేపటిలోగా పూర్తి చేసి నివేదిక సమర్పించాలని స్పష్టం చేశారు. ఆర్డీవో వినోద్ కుమార్, మున్సిపల్ కమిషనర్ ఖమర్ అహ్మద్, ఈడీఎం రవీందర్ పాల్గొన్నారు.



- నిరాశలో మిగిలిన ఎనిమిది నియోజకవర్గాల వాసులు
- కాంగ్రెస్‌ను గెలిపించలేదనే వివక్ష అంటున్న విద్యావంతులు
- ఉమ్మడి జిల్లాకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని డిమాండ్



# మాకేవి యంగ్ ఇండియా స్కూల్స్

### ఉమ్మడి జిల్లాలో రెండు నియోజకవర్గాలకే అవకాశం

మంచిర్యాల ప్రతినిధి/నిర్మల్, అక్టోబర్ 10(నమస్తే తెలంగాణ) : రాష్ట్ర ప్రభుత్వం యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మించాలని నిర్ణయించింది. ఈ మేరకు పైలెట్ ప్రాజెక్టుగా రాష్ట్రంలోని 28 నియోజకవర్గాలను ఎంపిక చేసింది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో పది నియోజకవర్గాలు ఉండగా.. మంచిర్యాల, చెన్నూర్ నియోజకవర్గాల్లో నిర్మాణానికి అనుమతులు ఇచ్చారు. నేడు(శుక్రవారం) పాఠశాలలల నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నారు. రాష్ట్రంలో 33 జిల్లాలు ఉంటే కేవలం 28 నియోజకవర్గాలను ఎంపిక చేయడంపై ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. జిల్లాకు ఒకటి చొప్పున 33 జిల్లాల్లో పైలెట్ ప్రాజెక్ట్‌గా తీసుకుంటే అందరికీ సమప్రాధాన్యం ఇచ్చినట్లు అయ్యేదనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. ఇప్పుడు విడుదల చేసిన జాబితాలో అధికార పార్టీ మంత్రులు, ఆ పార్టీ సీనియర్ నాయకులు ఉన్న నియోజకవర్గాలనే ఎంపిక చేశారని మండిపడుతున్నారు. కాగా.. ఒక్కో స్కూల్‌ను 20 నుంచి 25 ఎకరాల స్థలంలో ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నది. అలాగే స్కూల్ కాంప్లెక్స్ నిర్మాణాలు, ఇతర మౌలిక సధుపాయాల కల్పనకు మరో రూ.25 కోట్లను వెచ్చించనున్నది.

### ఉమ్మడి జిల్లాకు అన్యాయం

ఉమ్మడి జిల్లాల ప్రాతిపాదికన ఈ విషయంలో ఆదిలాబాద్ జిల్లాకు తీవ్రమైన అన్యాయం జరిగిందని విద్యావంతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వెనుకబడిన జిల్లాకు ప్రాధాన్యం ఇవ్వాల్సిన సర్కారు పదింటిలో ఒక్క నియోజకవర్గాన్నే ఎంపిక చేయడం ఏంటని ప్రశ్నిస్తున్నారు. కేసీఆర్ సర్కారు ఉన్నప్పుడు అన్ని నియోజకవర్గాలు, అన్ని జిల్లాలకు సమప్రాధాన్యం ఇచ్చేదని గుర్తు చేసుకుంటున్నారు. పైలెట్ ప్రాజెక్ట్‌గా ఏదో ఒకటి చేసి సక్సెస్ అయ్యాక.. మిగిలినవి చేయొచ్చుగా ప్రత్యేకించి 28 సెలెక్ట్ చేయడం వెనుక మతలాబేంటో చెప్పాలంటున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో పదింటిలో కేవలం నాలుగు స్థానాలు మాత్రమే అధికార పార్టీ గెలిచింది. అందుకే మంచిర్యాల మినహా మిగతా జిల్లాలపై సర్కార్ వివక్ష చూపిందని మండిపడుతున్నారు. గెలిచిన నలుగురు మంత్రి పదవి కోసం పైరవీలు చేయడమే తప్ప.. అభివృద్ధి విషయంలో కొట్లాడి న్యాయం చేసే ఆలోచన ఎవరూ చేయడం లేదంటున్నారు. యంగ్ ఇండియా స్కూల్స్ విషయంలో ఆదిలాబాద్‌కు అధిక ప్రాధాన్యం ఇస్తూ.. మరిన్ని స్కూళ్లకు మంజూరు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు.

### అడవి బిడ్డలకు దక్కని ప్రాధాన్యత

ఖానాపూర్ నియోజకవర్గంలో అధికార పార్టీ ఎమ్మెల్యే ఉన్నప్పటికీ ఎంపిక చేయలేదు. గిరిజనులు, ఆదివాసులు ఎక్కువగా ఉండే ఖానాపూర్ నియోజకవర్గాన్ని అయినా మొదటి విడుతలో ఎంపిక చేసి ఉంటే ఈ ప్రాంత గిరిజన బిడ్డలకు మేలు జరిగేదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అక్ష్యరాస్యత శాస్త్రీయతపై ఎలాంటి సర్వేలు గాని నిర్ధారణ గాని జరపకుండానే అడ్డగోలుగా కేటాయింపులు జరిపారన్న ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. ముఖ్యంగా ఈ స్కూళ్ల ఎంపికలో మారుమూల ప్రాంతాలను కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరించిందన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

### ప్రభుత్వం పునరాలోచించాలి



ఆసిఫాబాద్ అంబేద్కర్‌చౌక్, అక్టోబర్ 10 : ఆదివాసీ జిల్లాలో యంగ్ ఇండియా స్కూళ్లు ప్రారంభిస్తే ఇక్కడి విద్యార్థులకు ఎంతో మేలు చేకూరుతుంది. ఇప్పటికే జిల్లాలోని కొన్ని పాఠశాలల్లో ఉపాధ్యాయులు లేక గిరిజన విద్యార్థులు చదువుకు దూరం అవుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం పునరాలోచించి జిల్లాకు యంగ్ ఇండియా స్కూల్‌ను మంజూరు చేయాలి. అప్పుడే అడవిబిడ్డలకు నాణ్యమైన విద్య అందుబాటులోకి వస్తుంది. అక్షరాస్యత శాతం కూడా పెరుగుతుంది.

- వేణుగోపాల్, అధ్యాపకుడు, ఆసిఫాబాద్

### బాధాకరం



కౌటాల, అక్టోబర్ 10 : రాష్ట్రంలోనే మా నియోజక వర్గం ఒకటో నంబర్. కానీ అభివృద్ధి, సంక్షేమ పథకా ల అమలులో మాత్రం చిట్ట చివరన ఉంటుంది. పాలకుల నిర్లక్ష్యానికి మారుమూల ప్రాంత విద్యార్థులకు తీవ్ర అన్యా యం జరుగుతుంది. ఇంటిగ్రేటెడ్ విద్య కోసం సి ర్పూర్ నియోజకవర్గాన్ని ఎంపిక చేయక పోవడం బాధాకరం. రాజకీయాలు పక్కన పెట్టి ఇక్కడి పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించేలా ప్రభు త్వం చర్యలు తీసుకోవాలి.

- ముర్‌ముర్‌ వాయు కుమార్, కౌటాల, డీఎడ్, పీజీ

### లిస్టులో మా జిల్లా లేదు



ప్రభుత్వం ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియళ్లను ప్రారంభిస్తున్నట్లు ప్రకటించింది. ఆ లిస్టులో మా జిల్లా లేకపోవడం బాధేసింది. మారుమూల ఆదివాసీ జిల్లా అయినందునే చిన్నచూపు చూసినట్లు ఉంది. ఇప్పటికైనా సర్కారు స్పందించి మా మారుమూల జిల్లాకు ఇంటిగ్రేటెడ్ పాఠశాలను మంజూరు చేయాలి

- నక్క సుధాకర్, కౌటాల, డిగ్రీ, పీజీ



ధన్నూర్(కే)లో ప్రహరీ నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

## ఆధ్యాత్మిక మార్గంతోనే ప్రశాంతత

### బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్

బోథ్, అక్టోబర్ 10 : ఆధ్యాత్మిక మార్గంతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. గురువారం ధన్నూర్(కే)లో జగదాంబ దేవి, శ్రీసేవాలాల్ మహారాజ్ మందిర ప్రహరీ నిర్మాణానికి భూమిపూజ చేశారు. అంతకుముందు ధన్నూర్(బీ) గ్రామంలో ప్రతిష్ఠించిన దుర్గాదేవికి ప్రత్యేక పూజలు చేశారు. మండపం వద్ద ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి ఒక్కరు భక్తి భావాన్ని పెంపొందించుకోవాలన్నారు.



తలమడుగు మండలంలోని దేవాపూర్ ఎక్స్‌రోడ్ నుంచి కజ్జర్లకు వెళ్లే దారిలో మొరం తవ్వకాలు

## గుట్టలను కొల్లగొడుతున్నారు

- యథేచ్ఛగా మొరం తవ్వకాలు
- జిల్లా కేంద్రం మీదుగా అక్రమ రవాణా
- తవ్వకాల నియంత్రణ జరిగేనా?

ఆదిలాబాద్, అక్టోబర్ 10(నమస్తే తెలంగాణ) : ఆదిలాబాద్ జిల్లాలోని తలమడుగు, తాంసి మండలాల్లో మొరం తవ్వకాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. అనుమతులు లేకుండా అక్రమార్కులు భారీగా మొరం తరలిస్తూ లక్షల రూపాయలు సంపాదిస్తున్నారు. ఇండ్లు, లే అవుట్‌లు, రహదారుల నిర్మాణానికి భారీగా మొరం తరలిస్తున్నారు. తలమడుగు మండలంలోని దేవాపూర్ ఎక్స్‌రోడ్, కజ్జర్ల శివారులో గుడ్డిగుట్ట.. తాంసి మండలంలోని పుర్రెలగుట్టలో తవ్వకాలు జరుగుతున్నాయి. జేసీబీలో గుట్టలను తవ్వుతూ నాణ్యమైన మొరాన్ని వెలికితీస్తూ అక్రమ రవాణాకు పాల్పడుతున్నారు. మొరం రవాణాకు రోడ్లను కూడా నిర్మించుకుంటున్నారు. రాత్రి, పగలు తేడా లేకుండా భారీ టిప్పర్లలో తరలిస్తున్నారు. పొలాల సమీపం నుంచి వాహనాలు వెళ్తుండడంతో దుమ్ము, దూళీ కారణంగా పంటలు పాడవుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### అసైన్డ్ భూముల్లో అల్లకల్లోలం

ఉమ్మడి రాష్ట్రంలో తలమడుగు, తాంసి మండలాల్లో పేదలకు అప్పటి ప్రభుత్వం భూములను పంపిణీ చేసింది. వ్యవసాయం చేసుకుని ఉపాధి పొందడానికి అందించారు. పేదలకు ఉమ్మడి రాష్ట్ర పాలకులు ఇచ్చిన భూములు గుట్టలు, బండలతో కూడినవి కావడంతో వారు వ్యవసాయం చేసుకునే అవకాశం లేకుండా పోయింది. మొరం క్వారీలకు ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేవు. వ్యవసాయయోగ్యంగా లేని భూములను లక్ష్యంగా ఎంచుకున్న అక్రమార్కులు మొరం తవ్వకాలను జరుపుతున్నారు. వీటితోపాటు ప్రభుత్వం, అటవీ భూములను కొల్లగొడుతుడుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. అక్రమ మొరం తవ్వకాలపై గతంలో అధికారులకు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోవడం లేదని, అప్పుడప్పుడూ నామ్‌కే వాస్తేగా ఒకటి, రెండు టిప్పర్లను పట్టుకుంటున్నారని తెలిపారు.

### భారీగా గుంతలు.. ప్రమాదాలు

మొరం తవ్వకాల ఫలితంగా గ్రామాల శివారుల్లో గుంతలు ఏర్పడుతున్నాయి. ఐదు మీటర్లకుపైగా తవ్వుతున్నారు. తవ్వకాలతో ఏర్పడిన లొందల్లో వర్షం నీరు భారీగా నిలుస్తున్నది. మొరం తీసిన చోట ఏర్పడిన గుంతల వద్ద ఎలాంటి రక్షణ చర్యలు ఉండడం లేదు. నీరు నిలిచిన ఈ లొందలు ఏర్పడకపోవడంతో వన్యప్రాణులు, పశువులతోపాటు, సమీప గ్రామాల ప్రజలు వీటిలో పడి ప్రమాదాలకు గురవుతున్నారు. ఇటీవల బజార్‌హత్నూర్‌లో కంకర క్వారీలో పడి చిన్నారి మరణించింది. అధికారులు స్పందించి అక్రమ మొరం రవాణాకు అడ్డుకట్ట వేయాలని సమీప గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

## ఆర్మీ లెఫ్టినెంట్ హోదా పొందిన అధ్యాపకులు



ఆర్మీ లెఫ్టినెంట్ హోదా పొందిన లక్ష్మణ్

ఎదులాపురం, అక్టోబర్ 10 : ఆదిలాబాద్‌లోని గిరిజన సంక్షేమ గురుకుల డిగ్రీ కళాశాల అధ్యాపకుడు లక్ష్మణ్ పుట్ట ఆర్మీ లెఫ్టినెంట్ హోదా పొందారు. ఎన్‌సీసీ అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్న ఆయన మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌లో గల ఆర్మీ కంటోన్మెంట్‌లో ఎన్‌సీసీ ట్రైనింగ్ అకాడమీ శిక్షణ పొందారు. అనంతరం ట్రెయినింగ్ అకాడమీ కమాండెంట్ కపిల్‌జీత్ సింగ్ ఆయనకు ఆర్మీ లెఫ్టినెంట్ ర్యాంకును ప్రధానం చేశారు.

## రుణమాఫీ అమలులో కాంగ్రెస్ విఫలం

### మాజీ మంత్రి జోగు రామన్న

ఎదులాపురం, అక్టోబర్ 10 : రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ, రైతు భరోసా పథకం అమలు చేయడంలో కాంగ్రెస్ పార్టీ విఫలమైందని మాజీ మంత్రి జోగు రామన్న అన్నారు. గురువారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో జరిగిన ఆదిలాబాద్ నియోజకవర్గ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల సమయంలో కౌలు రైతులను ఆదుకుంటామని చెప్పిన కాంగ్రెస్ ఆ విషయాన్ని మరిచిపోయిందని, మహిళలకు రూ.2,500, పింఛన్లను పెంచలేదన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో వెలువడిన ఉద్యోగాల నోటిఫికేషన్ల ద్వారా నియమాక పత్రాలు ఇస్తూ తాము ఉద్యోగాలు ఇచ్చినట్లు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గొప్పులు చెప్పుకుంటున్నారన్నారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు రోకండ్ల రమేశ్, రమేశ్ రెడ్డి, మెట్టు ప్రహ్లాద్, గండ్రత్ రమేశ్, రాజన్న, మార్సెట్టి గోవర్ధన్, లింగారెడ్డి, పరమేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి జోగు రామన్న



సమావేశంలో పాల్గొన్న అదనపు కలెక్టర్

## ఎల్ ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలనను వేగవంతం చేయాలి

నిర్మల్ చైన్‌గేట్, అక్టోబర్ 10 : ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలనను వేగవంతం చేయాలని పురపాలక పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ ప్రధాన కార్యదర్శి దాన కిశోర్ అధికారులను ఆదేశించారు. గురువారం హైదరాబాద్ నుంచి జిల్లాల స్థానిక సంస్థల అదనపు కలెక్టర్లు, మున్సిపల్ అధికారులతో ఆయన వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. నిర్మల్ కలెక్టర్ కార్యాయంలో అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా దాన కిశోర్ మాట్లాడుతూ.. ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు. మహిళా శక్తి క్యాంటీన్ల గ్రౌండింగ్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. మెప్మా పీడీ సుభాష్, మున్సిపల్ కమిషనర్లు రాజు, మనోహర్, రాజేశ్, కుమార్ పాల్గొన్నారు.



పంపిణీ చేయనున్న బతుకమ్మ చీరలు

## బతుకమ్మ చీరలిస్తరట!

- ఆరు ఐటీడీఏ పరిధిలోని జిల్లాల్లోనే పంపిణీ చేయనున్న సర్కారు
- ఈ నెల 15 నుంచి అందించేందుకు కార్యాచరణ
- పండుగ ముగిశాక ఇచ్చి ఏం లాభమంటున్న మహిళలు

మంచిర్యాల, అక్టోబర్ 10 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : తెలంగాణ ఆడబిడ్డలు ఎంతో ఉత్సాహంగా జరుపుకునే బతుకమ్మ పండుగను రాష్ట్ర సర్కారు చిన్నచూపు చూస్తున్నదనడానికి ఇదే నిదర్శనం. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ మహిళల్లో ఆనందం నింపేందుకు చీరల పంపిణీకి శ్రీకారం చుట్టి పండుగకు ముందే అందించగా, కాంగ్రెస్ సర్కారు మాత్రం అంతా అయిపోయాక ఇచ్చేందుక ప్రణాళికలు రూపొందించింది. అదీ..కూడ రాష్ట్రంలోని ఐటీడీఏ పరిధిలోని ఆదిలాబాద్, మంచిర్యాల, కుమ్రం భీం ఆసిఫాబాద్, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబ్‌బాద్ జిల్లాల్లో మాత్రమే పంపిణీ చేయాలని నిర్ణయించింది. తెలంగాణ రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క ఆయా జిల్లాల్లో 12 లక్షల చీరలు పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేశారు. ఇదిలా ఉంటే ఇప్పటివరకు జిల్లాలకు పూర్తి స్థాయిలో చీరలు చేరుకోలేదని సమాచారం. గురువారం మూడు లోడ్‌లలో చీరలు రాగా గోదాంలలో భద్రపరిచారు. కాగా, సద్దుల బతుకమ్మ ముగిశాక చీరలిచ్చి ఏం లాభమంటూ మహిళలు మండిపడుతున్నారు.

### పంపిణీ ఆపేయమంటూ ఆదేశాలు

బతుకమ్మ చీరల పంపిణీని ఈనెల 7న ప్రారంభించాల్సి ఉండగా, ఆ కార్యక్రమాన్ని నిలిపివేయాలని ఆదేశాలు అందినట్లు తెలిసింది. బతుకమ్మ పండుగకు అందాల్సిన చీరలు.. ఆ తర్వాత ఇస్తేం చేసుకుంటామని మహిళలు ప్రశ్నిస్తున్నారు. కాగా ఈ చీరలను స్వయం సహాయక సంఘాల మహిళలతో పాటు 18 సంవత్సరాలు నిండిన ఎస్టీ మహిళలకు మాత్రమే పంపిణీ చేయనున్నారు.

**జిల్లాల వారీగా పంపిణీ చేయనున్న చీరలు**

| జిల్లా పేరు | ఎస్‌హెచ్‌జీ మెంబర్ | 18 ఏళ్లు నిండిన ట్రైబల్ ఉమెన్ | మొత్తం |
|---|---|---|---|
| ఆదిలాబాద్ | 1,18,545 | 83752 | 2,02,297 |
| భద్రాద్రి | 1,80,642 | 1,48,263 | 3,28,905 |
| ఆసిఫాబాద్ | 91,709 | 50,821 | 1,42,530 |
| మహబూబాబాద్ | 1,60,843 | 1,08,480 | 2,69,323 |
| మంచిర్యాల | 1,16,700 | 21,064 | 1,37,764 |
| ములుగు | 72,295 | 33,155 | 1,05,450 |